## యాభై ఏండ్ల దరిద్రం కావాలా?

# అభివృద్ధి కొనసాగాలా?



28వ డివిజన్‌లో ప్రచారానికి హాజరైన ప్రజలనుద్దేశించి మాట్లాడుతున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి గంగుల కమలాకర్

- విపక్షాల మాటలునమ్మితే అధోగతే
- మంత్రి, కరీంనగర్ బీఆర్ఎస్ అభ్యర్థి గంగుల
- 28, 29, 46 డివిజన్లలో విస్తృత ప్రచారం

కార్పొరేషన్, నవంబర్ 9 : ఉమ్మడి రాష్ట్రంలో యాభై ఏండ్లు సాగు, తాగునీరు, కరెంటు లేక అరిగోస పడ్డామని, మళ్లీ ఆ దరిద్రం కావాలో? ఇప్పుడు కొనసాగుతున్న అభివృద్ధి మరింత వేగంగా ముందుకు సాగాలో? ప్రజలు ఆలోచించుకొని ఓటు వేయాలని కరీంనగర్ బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి గంగుల కమలాకర్ సూచించారు. గురువారం నగరంలోని 28, 29, 46 డివిజన్లలో విస్తృత ప్రచారం సాగించగా, మంత్రికి స్థానిక మహిళలు మంగళహారతులు, డప్పుల చప్పుళ్లతో ఘన స్వాగతం పలికారు. మంత్రి మాట్లాడుతూ 50 ఏండ్లు అధికారంలో ఉన్న కాంగ్రెస్ నాయకులు తెలంగాణను అభివృద్ధి చేయకుండానే, ఇప్పుడు మళ్లీ తమకు ఒక్క అవకాశం ఇవ్వాలంటూ కోరుతున్నారని మండిపడ్డారు. అలాంటి నాయకుల మాటలు నమ్మితే తెలంగాణ అంధకారం అవుతుందన్నారు. తెలంగాణలో చిచ్చుపెట్టి కేసీఆర్‌ను ఓడించి హైదరాబాద్‌ను ఆంధ్రాలో కలిపేసుకునేందుకు అక్కడి నాయకులు కుట్రలు చేస్తున్నారని మండిపడ్డారు. ఇప్పటికే తెలంగాణను వ్యతిరేకించిన కిరణ్‌కుమార్‌రెడ్డి, కేవీపీ, షర్మిల, పవన్ కల్యాణ్‌లు బీజేపీ, కాంగ్రెస్ ముసుగులో హైదరాబాద్‌లో అడ్డా వేశారని పేర్కొన్నారు. ఇక్కడ సంపద పెరిగి.. ప్రజలు సంతోషంగా ఉంటే చూసి ఓర్వలేక కుట్రలు పన్నుతున్నారని విమర్శించారు. కాంగ్రెస్, బీజేపీ మాటలు నమ్మి ఓటు వేస్తే భవిష్యత్ తరాల నోట్లో మట్టి కొట్టినట్లే అవుతుందన్నారు. నగరాన్ని ఈ పదేళ్ల కాలంలో రాష్ట్రం నుంచి రూ.వేల కోట్ల నిధులు తీసుకువచ్చి ఎంతో అభివృద్ధి చేశానని చెప్పారు. ఈ అభివృద్ధి ఇలాగే కొనసాగాలంటే మరోసారి కారు గుర్తుపై ఓటు వేసి తనను ఆశీర్వదించాలని కోరారు. నగరంలో రోడ్లు, మురికికాల్వల అభివృద్ధితోపాటు కేబుల్‌బ్రిడ్జి, మానేరు రివర్ ఫ్రంట్, ఐటీ టవర్, మెడికల్ కళాశాల, వేంకటేశ్వర దేవాలయం, ఇస్కాన్ టెంపుల్ వంటి ఎన్నో అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. ఇన్నాళ్లూ పాలించిన పాలకులు ఎందుకు నగరాన్ని అభివృద్ధి చేయలేదని ప్రశ్నించారు. భవిష్యత్తు తరాలు బాగుండాలంటే కేసీఆర్ చేతులను మరోసారి బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని, కారు గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మేయర్ యాదగిరి సునీల్‌రావు, బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, కార్పొరేటర్లు నాంపెల్లి శ్రీనివాస్, వంగల శ్రీదేవి పాల్గొన్నారు.

## హ్యాట్రిక్ సాధించి

# రుణం తీర్చుకుంటా

- నాపై నమ్మకంతో సీఎం కేసీఆర్ మూడుసార్లు అవకాశం ఇచ్చారు
- నియోజకవర్గ ప్రజలు రెండుసార్లు అఖండ మెజార్టీతో గెలిపించారు
- మానకొండూర్ బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే రసమయి బాలకిషన్
- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీఆర్‌తో కలసి నామినేషన్ దాఖలు

మానకొండూర్, నవంబర్ 9 : మానకొండూర్ ఎమ్మెల్యేగా హ్యాట్రిక్ సాధించి నియోజకవర్గ ప్రజల రుణం తీర్చుకుంటానని బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే డాక్టర్ రసమయి బాలకిషన్ ధీమా వ్యక్తం చేశారు. ఈ మేరకు గురువారం ఉదయం కుటుంబ సభ్యులతో కలిసి కొండగట్టు అంజనేయస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, సుడా చైర్మన్ జీవీ రామకృష్ణారావు, సిరిసిల్ల జడ్పీవైస్ చైర్మన్ సిద్ధం వేణు, కేతిరెడ్డి దేవేందర్‌రెడ్డి, వేగురుపల్లి మాజీ సర్పంచ్ ముద్దసాని శ్రీధర్‌రెడ్డితో కలిసి నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారిణి లక్ష్మీకిరణ్‌కు అందజేశారు. అనంతరం విలేకరులతో రసమయి మాట్లాడారు. సీఎం కేసీఆర్ తనపై నమ్మకంతో మూడు సార్లు అవకాశం కల్పించారని గుర్తుచేశారు. నియోజకవర్గ ప్రజలు రెండు సార్లు అఖండ మెజార్టీతో ఎమ్మెల్యేగా ఆశీర్వదించారని, ఇప్పుడు వారి దీవెనలతో హ్యాట్రిక్ సాధిస్తానని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి పనులు తనను గెలిపిస్తాయని ధీమావ్యక్తం చేశారు.



మానకొండూర్: నామినేషన్ దాఖలు చేయడానికి వస్తున్న బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే రసమయి బాలకిషన్



మర్రివాణిపల్లిలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ అభ్యర్థి, మండలి విప్ పాడికౌశిక్‌రెడ్డి

## గజ్వేల్ సొంత ఊరు అంటున్న

# ఈటలకు బుద్ధి చెప్పాలి

- 20 ఏండ్లు గెలిపించిన హుజూరాబాద్‌పై ఆయనకు కృతజ్ఞత ఏది?
- ఏడుసార్లు గెలిచినా అభివృద్ధి శూన్యం
- ఒక్కస్కారి నాకు అవకాశం ఇస్తే అభివృద్ధి ఏంటో చూపిస్తా
- బీఆర్ఎస్ అభ్యర్థి, మండలి విప్ పాడికౌశిక్‌రెడ్డి

ఇల్లందకుంట నవంబర్ 9 : హుజురాబాద్‌లో 20 ఏండ్లు గెలిచి.. గజ్వేల్ సొంత ఊరు అన్న ఈటల రాజేందర్‌కు ప్రజలు తగిన బుద్ధి చెప్పాలని హుజూరాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి, మండలి విప్ మండలి విప్ పాడి కౌశిక్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆయన గురువారం మండలంలోని మర్రివాణిపల్లి, బోగంపాడు, గడ్డివాణిపల్లి, టేకుర్తి గ్రామాల్లో ప్రచారం చేపట్టగా, మహిళలు మంగళ హారతులు పట్టారు. పూలు చల్లుతూ అభిమానాన్ని చాటుకున్నారు. డప్పు చుప్పుల నృత్యాలతో అలరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హుజురాబాద్ నియోజకవర్గంలో ఈటల రాజేందర్ ఏడు సార్లు గెలిచినా ఎలాంటి అభివృద్ధీ చేయలేదని, ఆయనకు హుజూరాబాద్‌పై కృతజ్ఞత ఎక్కడున్నది? అని మండిపడ్డారు. బీజేపీ, కాంగ్రెస్ మాయగాళ్ల మాటలు నమ్మి మోసపోవద్దని, నాయకులు, కార్యకర్తలు, ప్రజలను కడుపులో పెట్టుకొని చూసుకుంటానని హామీ ఇచ్చారు. ఇల్లందకుంట శ్రీ సీతారామచంద్రస్వామి దేవాలయాన్ని యాదాద్రిగా తీర్చిదిద్దుతానని చెప్పారు. ఇక్కడ గ్రామ సర్పంచులు కల్లాల రాజిరెడ్డి, లలిత, వనమాల వాసు, తిరుపతిరెడ్డి, ఎంపీపీ పావని వెంకటేశ్, ఎంపీటీసీలు ఎక్కటి సంజీవరెడ్డి, తెడ్ల ఓదెలు, ఐలమ్మ, పీఏసీఎస్ వైస్ చైర్మన్ కందాల కొమురెల్లి, మాజీ వైస్ ఎంపీపీ చెక్క రంజిత్, మాజీ ఎంపీటీసీ గీత వీరారెడ్డి, మాజీ సర్పంచులు తిరుపతిరెడ్డి, బుర్ర రమేశ్, బీఆర్ఎస్ నాయకులు మహేందర్, రాములు, మర్రి శ్రీనివాస్ రెడ్డి, అభిలాష్‌రెడ్డి ఉన్నారు.

